# అమూల్యమైనవి

-గంటి భానుమతి

"గాలి పీలుస్తూంటే, పెరుగుతూంటే, ఊపిరి తీస్తూంటే, ప్రాణం ఉన్నట్లే కదా!" లా పుస్తకాలు ముందేసుకుని, ఓ పుస్తకంలో తలదూర్చి, నా లోకంలో ఉన్న నేను ఉలిక్కిపడి తలెత్తాను.

వచ్చినవాడు ఫల్గుణుడు కాదు, నవీన్. నా బాల్య స్నేహితుడు. హైదరాబాదుకు ముప్ఫయి కిలోమీటర్ల దూరంలో ఉన్న మా గ్రామం సిరిపల్లిలో ఉన్న పొలాన్ని చూసుకుంటూ, మధ్య మధ్యలో కవిత్వం రాస్తుంటాడు. హైదరాబాద్ పనిమీద వస్తే నా దగ్గరకొస్తుంటాడు.

నల్ల ఫ్రేమున్న కళ్ళజోడు, అక్కడక్కడా నెరసిన జుట్టు, జీన్స్ పాంటు మీద, తెల్ల కుర్తా, భుజాన ఓ సంచీ. నాకు తెలిసినప్పట్నించి, నేను వాడిని చూస్తున్నది ఈ అవతారంలోనే.

దగ్గర్లో ఉన్న ప్లాస్టిక్ కుర్చీని, బర్రున లాగి, నా ఎదురుగా కూచుని టేబుల్ మీద సంచి ఉంచి, టేబుల్ మీద చేతులుంచి, కళ్ళెగరేసాడు.

"చెప్పండి, లాయరుగారూ! ఓ ప్రాణిలో జీవం ఉందో లేదో ఎలా తెలుస్తుంది?"

"అబ్బా! అసలు విషయం ఏంటిటి? సస్పెన్స్ దేనికీ?"

వాడు నా మాటలు పట్టించుకోలేదు.

"మా ఊళ్ళో రెండు హత్యలు జరుగుతున్నాయి. రెండు..." తన రెండు వేళ్ళని నా ముందుంచి, ఊపుతూ అన్నాడు.

"అహఁ.. అలాగా... అయితే పోలీస్టేషన్‌కెళ్ళి.. రిపోర్టివ్వండి.." వ్యంగ్యంగా అన్నా.

"హత్యలు... అందరికీ తెలిసేలా... అందరి ముందరా... పైగా, ప్రభుత్వమే పరోక్షంగా చేయిస్తోందని నేనంటే..." కళ్ళెగరేసాడు.

"సోది ఆపు. అసలు సంగతి చెప్పకుండా, ఈ నాటకం ఏంటిటీ?"

"నాటకం కాదురా, నిజం. మనిషిని చంపితేనే హత్యా! ఊపిరి తీస్తూ, కొత్త చిగుళ్ళు తొడుగుతూ, రోజు రోజూ ఎదుగుతూ, గునగునా వచ్చేస్తున్న ఆకులతో ఉన్న చెట్టుని నలుగురికి ఉపయోగ పడ్తున్న చెట్టుని, మొదలంటూ నరికితే, దాన్ని హత్య అనరా! చెట్లకి ప్రాణం ఉందన్న సంగతి, జగదీశ్ చంద్రబోస్ లోకానికి చెప్పాడేమో!"

ఆ గొంతులోని తీవ్రతకి ఆశ్చర్యపోతూ వాడిని చూసాను.

"నిజం... నిజంరా... మనం చిన్నప్పుడు ఆడుకున్న చింతచెట్ల నీడ యింక ఉండదు. కుంచించుకుపోతున్న ముత్యాల చెరువుని పూడ్చేసి, ఏదో ఫాక్టరీ కడ్తారుట. ఒక్కసారి రా... ఊరు వచ్చి, వాటిని చూడరా.. ఆ చెట్టు తరఫున, ఆ చెరువు తరఫున వాదించి, వాటిని రక్షించరా!" అని సంగతంతా వివరంగా చెప్పాడు.

కడుపులో బాధ ఉండలు చుట్టుకుపోయింది.

ఓ ఐదు నిమిషాలు అలాగే కూచుండిపోయాను. తర్వాత, లోపలికెళ్ళి నా భార్య జయంతికి చెప్పి, కారు తాళాలు తీసుకుని వచ్చాను. నవీన్‌ని తీసుకుని మా ఊరి వైపు వెళ్లాను.

ఎవరో తీరిగ్గా కూచుని, పేర్చినట్లుగా ఉన్న బండరాళ్ళు, గరుకు మట్టి నేలలు, తాటిచెట్లు, మర్రిచెట్లు, రావిచెట్లు, చిన్న చిన్న పొదలు, మధ్యన నల్లటి తార్రోడ్డు. సంచారం చాలా తక్కువగా ఉన్న పరిసరాలు. అవార్డు విన్నింగ్ బ్లాక్ అండ్ వైట్ సినిమాలోని దృశ్యాలు కదిలిపోతున్నట్లుగా ఉంది.

ఓ గంట ప్రయాణం చేశాక మా ఊరు చేరుకున్నాం. ఓ సాయిబాబా గుడి, ప్లాస్టిక్ సామాన్ల దుకాణాలు, బట్టల దుకాణాలు, హోటల్, శివాలయం వాటి వెనకాల, ఎర్రపెంకుల యిళ్ళు... స్కూలు కూడా దాటి... ఎల్లమ్మ గుడి కూడా దాటాం... ఊరి బయటికొచ్చాం.

విశాలంగా కనుచూపు మేర వరకూ, ఆకాశాన్ని అందుకుంటున్న ఎర్ర నేల... చెరువు దగ్గరికొచ్చాం.

ఇప్పుడు అది చెరువులాగా లేదు. ఇసుక వేసి చెరువుని పూడ్చేశారు. నీళ్ళు లేవు. మధ్యలో నీళ్ళున్నాయి. ఇంతల్లాగా ఎలా జరిగింది?

ఒకప్పుడు దానిలో తామరపూలు, ఆకులు ఉండేవి. అలాగే జాగ్రత్తగా అందులో ఈత కొట్టేవాళ్ళం. గాలి వీచినప్పుడల్లా, తామరాకులన్నీ

బద్ధకంగా, మెల్లిగా ఓవైపు లేచి, ఆవులించి, మళ్ళా ఒళ్ళు పరుచుకుని, చాపుకునేది.

ఇప్పుడంతా భయంకరంగా ఉంది.

ఆ చెరువు, మా చిన్నప్పటి రోజులో మా ఫ్రెండ్. మా ఊరి అవసరాలని తీర్చింది. తన మానాన తాను తన లిమిట్స్‌లో ఉండేది. ఎప్పుడు ఉధృతంగా లేదు. దాని అందాన్నే చూసాం. ఎవరికీ ఏ కష్టం కలిగించలేదు.

ఎండల్లో చిక్కిపోయినా, వర్షాకాలం కొంచెం ఒళ్ళు చేసినా, ఆ చెరువుతో ఎన్నో జ్ఞాపకాలు మా ఊరి వాళ్ళ మనసులో ఉన్నాయి. కార్తీక దీపాల్తో డెకొరేట్ చేసేవారు. బతకమ్మ పూలతో గౌరమ్మని సాగనంపే వారు.

## కృషితో నాస్తి

థ కోసమని కాదు కాని
చితిలో నుంచైనా సరే
ఓ చైతన్య జ్వాల భగ్గున మండాలి
విత్తుని పాతిపెట్టిన పిదపే కదా
మొక్కైనా, పువ్వైనా, చివరికి మహామానైనా
పుటంలో ద్రవీభవించాకే
అపరంజికైనా నిఖార్సుతనం
రాయిగానే మిగిలిపోవచ్చు వజ్రం
సాన రాపిళ్ల మెరుగుకోత కోయనంత కాలం

## గాయాల చరిత్ర

టి పాపల మీంచి నువ్వు నడిచి వెళ్ళిన జాడలు
యిప్పుడు చారలు కడితేనేం?
నిన్నటి వరకూ నువ్వు నా బాల్యమే
వెచ్చని పూలచేతుల్తో దేహమంతా తడిమిన మృదు
స్పర్శవే
జ్ఞాపకాలు చెరిగిపోతున్న నరకం
అక్షరాల అరల్లో యిమడలేని తనం నుండి
అక్షరాలు బహిష్కరిస్తున్న నిజం వరకూ సత్యమే!
లోయల్లో ప్రతిధ్వనించిన మరణ మౌనాల్ని
అరుణ జలంగా కొండవాగు మోసుకొస్తున్నది.
ఇప్పుడా నిప్పు నీల్లని దోసిటపట్టేదెవరు?
లావాల్ని తాగి జీర్ణించుకున్నప్పుడే మరి
కత్తులు చేసిన గాయాల చరిత్ర తెలిసేది

**–ఏటూరి నాగేంద్రరావు**

ఆ చెరువు ముందు నుంచుంటే, నిన్నటి చెరువేనా యిది, నిన్న యిలాగే ఉందా అని ఏరోజు కారోజు అనిపించేది. రోజు రోజు కొత్తదనం నింపుకొనేది. మా ఊరి వాళ్ళని ఏదీ ఎప్పుడూ అడగలేదు. ఏదీ కోరలేదు.

ఆ చెరువుకి కాస్త దూరంలో, విశాలంగా, స్వేచ్ఛగా, ఎత్తుగా పెరిగిన చింతచెట్లు రెండు. ఆ రెండు చెట్లు ఎప్పుడూ మా ఊరి వాళ్ళకి గొడుగులే. ఏ కాలం అయినా, దానికింద పెద్దలూ, పిల్లలూ, పశువులూ నిర్మలానందాన్ని పొందుతుండేవారు.

అలాంటిది ఈ రోజున, నోరు లేదని, పోట్లాడే శక్తి లేదని, వీటిని నరికేస్తారా!

వీటిని రక్షించకపోతే నా చదువెందుకు? ప్రాక్టీసు ఎందుకు? వెంటనే హైదరాబాద్ వెళ్ళి నలుగురు లాయర్లని కనుక్కున్నాక ఆ మందుల ఫాక్టరీ కడ్తున్న యజమాని కేశవ్ మీద దావా వేసాను. ఆ వెంటనే సిరిపల్లిలో పనులు మానేసారు. కేసు తేలేవరకూ ఏం కొనసాగించడానికి లేదు.

నోరు లేని వాటి తరఫున వాదించే రోజు వచ్చింది.

ఆ రోజు.. కోర్టులో మా కేసే...

నేను లేచి జడ్జిగారు ముందు నుంచున్నాను.

"మైలార్డ్.. నోరులేని.. అశక్తులైన జీవాల ప్రాణాలకి ముప్పు వాటిల్లుతోంటే, వాటి తరఫున వాదించడానికి పూనుకున్నాను..."

వింతగా చూసి తల ఊపారు.

"మైలార్డ్.. హైదరాబాద్‌కి ఓ ముప్ఫయి కిలోమీటర్ల దూరంలో ఉన్న సిరిపల్లిలో ఓ చెరువుకి, రెండు చింతచెట్లకి ఆయువు మూడిపోతోంది. ఈ అనంత విశ్వంలో జీవించే హక్కు అందరికీ ఉంది. ఒక జీవిని చంపడం అంటే హత్య కిందకే వస్తుంది..."

కోర్టులోని వారంతా వింతగా చూస్తున్నారు.

ఓవైపున కేశవ్ బోనులో ఉన్నాడు. మరోవైపున ఖాళీగా ఉన్న బోను. అందులో ఓ స్టూలు, దాని మీద ఓ కూజా. ఆ నీళ్ళ కూజా పక్కనే చింతకాయలతో ఉన్న ఓ చిన్న కొమ్మ.

రెండువైపులా ఓసారి చూసి కేశవ్ వైపు తిరిగారు జడ్జిగారు.

"ఆ మూగజీవాల తరఫున మాట్లాడిన లాయరు మాటలు మన్నించగలరా?" అని కేశవ్‌ని చూసి అన్నారు.

"నాకు నోరుంది. నా మీద వేసిన ఈ కేసు గురించి నేను మాట్లాడుకోగలను. ఇంక లాయరుగారి

విషయానికొస్తే, ఆయన కోరికని మన్నించము.

అక్కడ ఓ మందుల ఫ్యాక్టరీ రాబోతోంది. ప్రాణాలు నిలిపే మందులు, ఎన్నో రోగాలకి అవసరం అయ్యే మందులు... అంతే కాకుండా, ఇక్కడ కొంతమందికి ఉపాధి కూడా దొరకుతుంది. దానితో రోడ్లు, నీరు, విద్యుత్... ఇంకా చిన్న చిన్న పరిశ్రమలు ఈ ఫ్యాక్టరీకి అనుబంధంగా ఉండేవి ఎన్నో వస్తాయి. దేశ ప్రగతి, రాష్ట్ర, గ్రామ అభివృద్ధి కూడా మీరు చూడాలి. అంతే కాకుండా, అభివృద్ధి అనేది నాగరికతకి ప్రతిరూపం.. అందుకని, ఈ కేసుని మీరు అభివృద్ధి కోణం లోంచి చూడండి..."

జడ్జిగారు తల ఊపారు.

వెంటనే నేను లేచాను.

"అభివృద్ధి కన్నా ముఖ్యమైనది, మనం మన సహజ వనరులని కాపాడుకోవడం. ఈ చింతచెట్లు స్వర్ణ జయంతులు చేసుకుని ఉంటాయి. అవి ఎవరికి అపకారం చేసిందని, ఈరోజున నరికేస్తాం అని అంటున్నారు? ప్రాణాలు పోయడం చాలా కష్టం. ప్రాణాలు తీయడం చాలా సులభం. ఈ విషయంలో చెట్లయినా, మనుషులయినా ఎవరైనా ఒకటే. ఒకళ్ళకో న్యాయం, మరొకళ్ళకో న్యాయం ఉండకూడదు. చట్టం ముందు అందరూ సమానులే కదా! ఈ సంగతి కోర్టు వారికి బాగా తెలుసు. అందుకని, మీరు ఈ కేసుని ఓ ప్రాణిని బ్రతికే హక్కులోంచి చూడాలని నా ప్రార్థన."

సానుకూలంగా నావైపు చూసారు జడ్జిగారు.

"మీరేమయినా చెప్పదల్చుకున్నారా? వారి మాటలకి సమాధానం మీ దగ్గరుందా?" జడ్జిగారు కేశవ్‌ని చూస్తూ అన్నారు.

రెండు చేతుల్ని ముందున్న బద్దీ మీద పెడ్తూ, కేశవ్ తల ఊపాడు.

"గౌరవనీయులైన జడ్జీగారికి వినయంగా మనవి చేసుకుంటున్నాను. ప్రకృతిలో కొన్ని ధర్మాలున్నాయి. దానిని మనం వ్యతిరేకించకూడదు. అభివృద్ధి చెందే చోట, కొంచెం వినాశం తప్పదు. ఓ పులి, ఓ జింక పిల్లని చంపడం మహాపాపం అని అనుకోకూడదు. అది దాని ధర్మం. అలా జరగకపోతే, ఈ గడ్డీ, ఆకులు, చెట్లు, జీవరాశులు ప్రకృతిలో సమతుల్యంతో ఉండవు. ఈ ఫుడ్ చెయిన్, భూమి పుట్టిన్నాటి నుంచి ఉంది. ఇది ఎండ కాచినంత సహజంగా జరిగిపోతుంది.

అదేవిధంగా నాగరికతలో అభివృద్ధి ఓ భాగం. నాగరికత పెరుగుతూంటే కొంత నష్టం జరుగుతుంది..

## మనుగడ

బులకు మతం తెలియదు!
అడ్డొస్తే చాలంటుంది
ఒక్కొక్కరిని మట్టుపెట్టడానికి!
ఎక్కడైతే టెర్రరిస్టులున్నారో
అక్కడే విధ్వంసం ఉంటుంది.
వారెప్పుడు మేలుకుంటారో
ఎప్పుడు దాడులు జరుపుతారో
తెలిసేదెవరికి?
విదేశీయుల వల్లే
ప్రమాదముందని తెలిసినా
ఏమీ చేయలేం మనం!
ఆంధ్రా ఏంటి కర్నాటకేంది
గుజరాతైతేనేమి ఢిల్లీతో బాటే
దేశమంతా భస్మీపటలమే
టెర్రరిస్టుల వ్యూహం!
అలాటి ఉగ్రవాదుల
నంతం చేయనంత కాలం
దేశానికి మనుగడే లేదు!
ఈశాన్య రాష్ట్రాలంతం
చూడాలనే బంగ్లాదేశీయుల
పన్నాగం తెలియదా
మన దేశానికి
ఎలా చొరబడ్తున్నారో
ఎలా తిష్టవేసారో ఎందుకు
పౌరసత్వం ఇస్తున్నారో
మనకవగతం కాదుగా!
ప్రపంచమంతా మట్టుబెట్టే
జిహాదీలైతే ఇంకెక్కడ
శాంతి సౌభ్రాతృత్వం?
మతోన్మాదుల ఆట కట్టించే
దమ్మెవరిది? అంతా
కన్ను తెరిస్తే ఎంతటి
దురాత్ముడినైనా
అంతమొందించగలం!

—ఆచార్య నరేంద్ర

తప్పదు..."

నేను వెంటనే కేశవ్‌కి జడ్జీగారికి మధ్య నుంచున్నాను.

"నేనొప్పుకోను. ఈ నాగరికత అనే పదంతో ముడిపెడ్తున్న అతని మాటలకి నేను ఒప్పుకోను.

ఫ్యాక్టరీలు కట్టడం నాగరికత అయితే, దానికోసం కొన్ని వందల చెట్లు నరికేయాలా! నరికేయడం అభివృద్ధా!

నాగరికత వచ్చింది, నాగరికత వచ్చింది అని అంటూ పదిసార్లు జపించి, పదే పదే చెప్తూ మనల్ని హిప్నాటైజ్ చేస్తున్నారు. మనల్ని ఓ మాయలో పడేసి నమ్మిస్తున్నారు. మనం నమ్మేస్తున్నాం.

ఇన్ని వేల ఏళ్ళలో ఎన్నో వేల యుద్ధాలు జరిగాయి. హిట్లర్, స్టాలిన్, ముసోలినీలు ఈ కాలం అయితే, తుగ్లక్‌లు, ఘోరీలు, గజనీలు, మొగల్ రాజులు, బాబర్ నుంచి... కాలం ఏదయినా రాజ్యాభివృద్ధి అంటూనే కదా, లక్షల లక్షల మంది ప్రాణాలు తీసారు. దీన్ని నాగరికత అని అంటారా? ఇవన్నీ రాక్షస ప్రవృత్తులు. ఇంకో జీవిని తమ స్వార్థం కోసం చంపకుండా, జీవించడం నిజమైన నాగరికత. అలాంటి నాగరికత యింకా రాలేదు. కనీసం చదువుకున్న వాళ్ళం మనం అయినా, మనకు ఉపయోగపడ్తున్న వాటిని నాశనం చేయకుండా ఉంటే మన వంతుగా మనం కొంచెం ఆ మూగజీవాలకి మేలు చేసినవాళ్ళం అవుతాం."

కేసుని ఓ వారానికి వాయిదా వేసారు.

ఆనోటా, ఈనోటా.. ఆ పేపరు, ఈ ఛానెల్ వల్ల అందరికీ కేసు తెలిసింది. నోళ్ళు నొక్కుకున్నారు.

చెట్లు, చెరువు ప్రాణాలు కాపాడండి అని పిటీషన్ పెట్టుకోవడం ఏంటిటి? ఏదో తలతిక్క కేసు అని అన్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ అర్థవంతమైన కేసులా అనిపించింది.

ఈ కేసు వెనక్కాల పర్యావరణ పరిరక్షకుల్లాంటి మేధాపట్కర్, మేనకాగాంధీ లాంటి వాళ్ళు లేరు. ఓ సుందర్‌లాల్ బహుగుణ అంతకన్నా లేరు. ఓ బాబా ఆమ్టే లాంటి వాళ్ళు కూడా లేరు. ఓ ఆర్గనైజేషన్ అంతకన్నా లేదు. ఎవరూ పట్టించుకోవడం లేదని, కేవలం చెట్లూ చెరువూ కోర్టుకెళ్లాయి న్యాయం కోసం. వాదించడానికి ఓ లాయర్ మాత్రం ఉన్నాడు అంటూ అంతా అనుకుంటున్నారు.

వాయిదా వేసిన రోజు రానే వచ్చింది.

కేశవ్ ముందు మాట్లాడాడు.

"యువరానర్, ఈ మందుల ఫ్యాక్టరీ ఇక్కడే కట్టడానికి కారణాలున్నాయి. ప్రభుత్వం ఈ స్థలం చూపించింది. ఊరికి దూరంగా ఉంది. చుట్టూరా రాళ్ళూ, రప్పలూ తప్ప మరేం లేవు. పెద్దగా పొలాలున్న ప్రదేశం అంతకన్నా కాదు. రైల్వే లైను చాలా దగ్గర.

చెరువుంది కానీ, యిప్పుడు ఓ చిన్న చెలమ లాగా ఉంది. బోర్లున్నాయి కాబట్టి ఈ చెరువు అవసరం ఊరివాళ్లకి పెద్దగా ఉందని అనుకోము.

ఇంక చింతచెట్లంటారా.. వాటి వేళ్ళు పాకిపోయి ఉన్నందువల్ల, బిల్డింగ్ కట్టడానికి ఇబ్బంది. అందుకని వాటికి బదులుగా వేరే అందమైన, పూలుపూసే వృక్షాల్లాంటి చెట్లని వేసి కాంపన్సేట్ చెయ్యాలన్న ప్లాన్ కూడా మాకుంది. అందుకని, కోర్టువారిని నేను అభ్యర్థిస్తున్నాను, మా పనులు కొనసాగించడానికి అనుమతినివ్వవలసిందని..."

నేను లేచాను.

"యువరానర్, మా క్లయింట్ల తరఫు నుంచి చెప్తున్నాను. మాకిది యిష్టంలేదు. ఆ చింతచెట్లు మా ఊరి వాళ్ళ అన్నదాత. ఈ చింత చిగురు, చింత కాయలు, చింతపండు లేకుండా ఊళ్ళో ముద్దలు

## అంద చందాలు

టుకతోనె వచ్చు అసలు అందాలు
లావు సన్నమనుచు వారీరు చెప్పగా
స్లిమ్ముకొరకు వెళ్ళె బ్యూటిపార్లర్లకు
సొమ్ముతోటి కలసి కాలము ఖర్చయ్యె!
జాన జుట్టు కోసి చేతిలో పెట్టి
కంటిపైన బొచ్చు కొంత మట్టుకు పీకె
బంకమన్ను తెచ్చి ముల్తాను పేస్టనె
అందమేమొ గాని పర్సు ఖాళీ అయ్యె!
ఒంటినిండ బట్ట కరువు నేటి షోకులకు
ఉన్న బట్టనంత సన్నపీలికలు చేసి
ఇదియె ఫ్యాషననిరి గొప్ప కాస్టూమిస్టులు
తేడ తెలియక పాయె ఆడ మగ జాతికి!
రంగు కింద అసలు నీ మోము కనరాదు
అలుకు జల్లినట్టు పేష్టులన్నీ పులిమి
అదిరిపోవుచుండె అధరాలు మెరుపుతో
అసలు రంగు తెలియు ఎండలోన పోవ!

—వడుగు గోపాలరావు

దిగవు.

కర్రలు, కంపలు, ఎండుపుల్లలు, కొమ్మలు వాడుకుని వంట చేసుకునే కూలీలెంతమందో ఉన్నారు.

ఈ చెట్లకి ఎవరూ నీళ్ళు పోయక్కర్లేదు. ఎంతటి ఎండల్లోనైనా, దానికి కావల్సిన నీళ్ళు, అదే వెతుక్కుని వాడుకుంటుంది.

ఈ చెట్లు ఇచ్చే ప్రాణవాయువు ఈ ఫ్యాక్టరీ కట్టేవాళ్ళు, ఎన్ని చెట్లు నాటితే వస్తుంది?

ఈ చెట్లు వాతావరణంలోని వేడిని తగ్గించడానికి, మా ఊరి గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్‌ని తీసుకుంటోంది. దీన్ని నరికేస్తే, వెంటనే ఎన్ని పెద్ద చెట్లు నాటాలి?

గ్లోబల్ వార్మింగ్ అంటూ, అటూ ఇటూ ఉన్న ధృవాల నుంచి, భూమధ్య రేఖ వరకూ ఉన్న అన్ని దేశాలూ, తలలు పట్టుకుంటున్నాయి. ఏయేటి కాయేడు పెరుగుతున్న వేడిని మనవంతుగా తగ్గించడానికే ప్రయత్నించాలి.

యువరానర్... బతకడానికి హక్కున్న ఆ చెట్లని, ఆ చెరువుని అదే కోణం లోంచి చూసి, వాటిని రక్షించండి.. దట్సాల్..." అంటూ కూచున్నాను.

జడ్జీగారు తీర్పు యిచ్చే రోజు.

"వాదోపవాదాలు విన్నాక, తీర్పు చెప్పడం కొంచెం కష్టమే అవుతోంది. అభివృద్ధి అవసరం. అయితే అదే సమయంలో పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత కూడా మనమీదే ఉంది. ఒక్కొక్కసారి రెండూ కూడా ఒకే సమయంలో కుదరదు.

భవిష్యత్తుని, సహజ వనరుల్ని దృష్టిలో పెట్టుకుని తీర్పునివ్వాల్సి వస్తోంది.

చెరువు పూడిక తీయించండి. వర్షాకాలంలో అందులోకి నీరు చేరేలాగా చేస్తే, మీరు కట్టే ఫ్యాక్టరీకి అందం యినుమడిస్తుంది. దాని చుట్టూ చెట్లు నాటితే గాలి కాలుష్యం కాస్త తగ్గుతుంది.

మీ ఫ్యాక్టరీ వ్యర్థాలని, చట్ట ప్రకారంగా శుభ్రంచేసి, ఫిల్టర్‌చేసి జీవకోటికి హాని కలగని చోటకి పంపండి.

అంత పెద్ద చెట్లని కొట్టెయ్యకూడదు. దాన్ని ఎలా ఉపయోగించుకోవాలా అని ఆలోచించండి. ఓపెన్ కాంటీన్ పెట్టుకోండి. చెరువు పక్కన, చెట్ల కింద టీ కాఫీలు తాగడం, టిఫిన్‌లు తినడం... అప్పుడు అది ఏ రెస్టారెంట్‌కీ తీసిపోదు. మీ భూమి పోయిందని అనుకోకూడదు. సహజ వనరుల్ని రక్షించాం అని అనుకోండి. లేకపోతే ముందు ముందు నీటిబొట్లు కొనుక్కునే పరిస్థితి రావచ్చు. మన మనుగడకే ముప్పు రావచ్చు.

మనిషిగా పుట్టినందుకు, నా వంతుగా ఓ చిన్న ధర్మాన్ని నిర్వర్తించానని అనిపించింది. కేసు గెలిచినందుకు ఆనందంగా ఉంది.

ఓ పది రోజుల తర్వాత వచ్చాడు నవీన్.

"ఏంట్రా? నా ఫీజేది? కేసు గెలిపించాను కదా!"

"రా... మరి... సిరిపల్లి పోదాం..."

"వర్షం వస్తోంది.. ఈసారి వస్తాలే..."

" ఈ వర్షంలోనే సిరిపల్లికి వెళ్తే బావుంటుంది..." అంటూ బలవంతంగా లేవదీసాడు.

సగం దూరం వెళ్ళేప్పటికి వర్షం ఆగిపోయింది. మేఘాలు వెళ్ళిపోయాయి. ఎండ వచ్చేసింది. తేమగాలి హాయిగా వీస్తోంది.

నీట్‌గా, కడిగినట్లున్న ఆ నల్లటి రోడ్డు మీద కారు జారిపోతూంటే ఊరు ఎప్పుడు వచ్చిందో కూడా గమనించలేని స్థితిలో ఉన్నాం.

చింతచెట్ల కింద నుంచున్నాం.

నవీన్ రెండు చేతులు ముందుకి చాచాడు. తలెత్తి పైకి చెట్లని చూసాడు.

"మీ ప్రాణాలు కాపాడినందుకు వకీలుగారు ఫీజు అడుగుతున్నారు. సారుకి ఏం యిస్తారో, ఏం యివ్వగలరో చెప్పుకోండి, యిచ్చుకోండి..." అని గట్టిగా అన్నాడు.

వీస్తున్న గాలికి, చెట్టు కొమ్మలు కదిలాయి. ఆకులు స్పందించాయి.

టపటపమంటూ నీటి బొట్లు మామీద... కొన్ని మా తల వెంట్రుకల్లో యిరుక్కుపోయినా, కొన్ని మా ముక్కుల మీద, చెంపల మీద, చాచిన చేతుల మీద ముత్యాలుగా జల జల రాలాయి.

నవీన్ నావైపు చూసాడు.

"ఇదిగోరా, నీ ఫీజు... రుణం ఉంచుకోలేదు..." రాలిన చినుకులున్న చేతుల్ని నా ముందుంచాడు.

వాడివైపు చూసాను.

"ఇదే నీ ఫీజు... ఆనందంతో వచ్చిన భాష్పాలురా ఇవి. ఈ ప్రపంచంలో అన్నింటికన్నా విలువైనవి ఈ భాష్పాలు. అమూల్యమైనవి. ఈ నీటి కణాలే మీకిచ్చే ఫీజు... దీని విలువని కట్టగలవా?..."

నా కళ్ళు చెమర్చాయి. నిజంగా అవి అమూల్యమైనవే. ఏమో! ముందు ముందు, వీటిని కొనే పరిస్థితి రాకుండా ఉంటే, నాకంతకన్నా యింకేం కావాలి. ■